క్లుప్తంగా

చిల్లంగిలో అన్నసమారాధన

కిర్లంపూడి: మండలంలోని చిల్లంగి పెరంటాలమ్మ అమ్మవారి ఆలయం వద్ద బుధవారం అన్నసమారాధన నిర్వహించారు. అమ్మవారి ఆలయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని తొమ్మిది రోజుల పాటు ఆలయం వద్ద ఉత్సవాలు నిర్వహించారు. ఈ ఉత్సవాల ముగింపు సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భారీ అన్నసమారాధన ఏర్పాటు చేశారు. స్థానిక, పరసర ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి అన్నప్రసాదం స్వీకరించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాటు చేశారు.

సి.రాయవరంలో పొలంబడి



సి.రాయవరంలో రైతులకు సూచనలు ఇస్తున్న ఏఓ జ్యోతి

ఏలేశ్వరం: మండలంలోని సి.రాయవరంలో బుధవారం వైఎస్సార్ పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. మండల వ్యవసాయాధికారి బి.జ్యోతి ఆధ్వర్యంలో రైతులకు పలు అంశాలపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఏఓ జ్యోతి మాట్లాడుతూ ఖరీఫ్‌లో వరి సాగు చేసిన రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలన్నారు. విత్తనశుద్ధి చేయడం ద్వారా అధిక దిగుబడి సాధించవచ్చన్నారు. మిత్రపురుగులు, శత్రుపురుగులను గుర్తించి వాటి నిష్పత్తి 2:1 ఉంటే పురుగు మందులు కొట్టకూడదన్నారు. వరి పంట సాగు చేసిన రైతులు ఎకరాకు 36 కేజీల నత్రజని, 24 కేజీల భాస్వరం, 24 కేజీల పోటాష్ వేయాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్బీకే సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

బ్యాంక్ అధికారులను సంప్రదించండి

గండేపల్లి: రైతు భరోసా సొమ్ములు పడని రైతులు బ్యాంక్ అధికారులను సంప్రదించాలని మండల వ్యవసాయాధికారి ఎ.సద్గురు మూర్తి సూచించారు. సంబంధిత రైతులు పట్టాదారు పాస్ పుస్తకం, ఆధార్ కార్డు జెరాక్స్‌లతో బ్యాంక్ అధికారులను సంప్రదించాలన్నారు. అలాగే 2023 ఖరీఫ్‌కు సంబంధించి ఈ–క్రాప్, ఈ–కేవైసీ చేయించుకునేందుకు ఈ నెల 30 వరకు గడువు ఉందన్నారు. రైతులు తప్పనిసరిగా ఈ–పంట నమోదు చేయించుకోవాలని సూచించారు.

వృద్ధులకు చీరల పంపిణీ



కిర్లంపూడిలో వృద్ధులకు చీరలు అందజేస్తున్న గుడాల కుటుంబ సభ్యులు

కిర్లంపూడి: గ్రామంలో వృద్ధులకు బుధవారం చీరలు పంపిణీ చేశారు. గ్రామానికి చెందిన గుడాల చిట్టిబాబు వర్ధంతి సందర్భంగా జగపతినగరం, ప్రత్తిపాడు సర్పంచ్‌లు మహేంద్రాడ శ్రీలత, గుడాల విజయలక్ష్మి, కొడుకులు గుడాల రాంబాబు, గుడాల వెంకటరత్నం గ్రామంలోని వృద్ధులకు చీరలు అందజేశారు. తొలిత హరిజనపేటలో చిట్టిబాబు విగ్రహానికి కుటుంబ సభ్యులు, స్థానిక నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో చదరం చంటిబాబు, మూరా సహదేవుడు, తూము కుమార్, కుర్ల చినబాబు తదితరులు పాల్గొన్నారు.

పాస్టర్లకు గౌరవవేతనం విడుదలపై హర్షం

జగ్గంపేట: రాష్ట్రం ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు పాస్టర్లకు గౌరవ వేతనం విడుదల చేయడం ఆనందంగా ఉందని రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ జాన్ వెస్లీ అన్నారు. జగ్గంపేటలో గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. సంక్షేమ పథకాలు అమలులో రాష్ట్రం అగ్రస్థానం ఉందని తెలిపారు. కుల, మత, ప్రాంత, పార్టీలు, రాజకీయాలకు, అతీతంగా అర్హతే ప్రామాణికంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని ప్రశంసించారు.

క్షణికావేశంలో నిర్ణయాలు తీసుకోవద్దు

గండేపల్లి: క్షణికావేశంలో తీసుకునే నిర్ణయాలు భవిష్యత్‌ను నాశనం చేస్తాయని ఆదిత్య కళాశాలల ప్రిన్సిపాల్ కె.రవిశంకర్ అన్నారు. మండలంలోని సూరంపాలెం ఆదిత్య క్యాంపస్‌లో బుధవారం బలవన్మరణాలు లేని భారతావని కోసం అందరూ కృషి చేద్దాం అనే నినాదంతో ఆత్మహత్యల నివారణ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ పరీక్షల్లో విఫలమయ్యామని, తల్లితండ్రులు మందలించారని, ఇతర కారణాలతో జీవితాన్ని నాశనం చేసుకోవడం మంచిది కాదన్నారు. అనంతరం విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఈదా ఇంటర్నేషనల్ ఫౌండేషన్ కాకినాడ జిల్లా జాయింట్ ట్రెజరర్ తోటకూర గంగాధర్, ఎన్ఎస్ఎస్ కో ఆర్డీనేటర్ కె.శృతి, ఫార్మసీ ప్రొఫెసర్ బీఎస్‌బీ వైదేహి, ఎన్.దివ్య, జి.వేదప్రియ, పి.వినీల, టి.ప్రశాంతి తదితరులు పాల్గొన్నారు.

ముందస్తు రబీకి సన్నాహాలు

- నాలుగు మండలాల్లో లోటు వర్షపాతం
- గ్రామాల్లో ఇంకా పడని ఖరీఫ్ వరినాట్లు
- రైతులను ముందస్తు రబీ సాగుకు సిద్ధం చేస్తున్న అధికారులు
- 2335 ఎకరాల్లో వరి, అపరాల విత్తనాలకు ప్రతిపాదనలు



వి.కొత్తూరులో ఖరీఫ్ నాట్లుపడక నిరుపయోగంగా ఉన్న భూములు



వర్షాలు కురవక, నీరులేక వెలవెలబోతున్న చామవరం పల్లివాని చెరువు

తుని రూరల్: వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో మెట్ట ప్రాంతమైన తుని నియోజకవర్గంలో ఖరీఫ్ వరినాట్లు పూర్తి కాలేదు. ఈ నెలాఖరు వరకు ఎదురు చూసి ప్రత్యామ్నాయ పంటలు సాగుకు రైతులు సిద్ధం కావాలని వ్యవసాయ శాఖ అధికారులు సూచిస్తున్నారు. ఖరీఫ్ కాలం మూడు నెలలు గడిచిపోవడంతో ముందస్తు రబీపై దృష్టి సారించాలన్నారు. అందుకు అవసరమైన వరి, అపరాల విత్తనాలను అందుబాటులో ఉంచేందుకు అధికారులు ప్రతిపాదనలు చేశారు.

లోటు వర్షపాతం

తుని వ్యవసాయ సబ్ డివిజన్ పరిధిలో ఐదు మండలాలు ఉండగా నాలుగు మండలాల్లో లోటు వర్షపాతం నమోదైంది. కోటనందూరు మండలంలో ఓ మోస్తరు అధిక వర్షాలు కురిశాయి. ఖరీఫ్ సీజన్‌కు ఐదు మండలాల్లో 2647.7 మిల్లీ మీటర్లు వర్షపాతం నమోదు కావలసి ఉండగా 2077.7 మిల్లీ మీటర్లు నమోదైంది. 570 మిల్లీ మీటర్ల వర్షపాతం లోటు ఏర్పడింది. కోటనందూరు, రౌతులపూడి మండలాల్లో వరి, అపరాలు, తుని మండలంలో వరి, శంఖవరం మండలంలో అపరాలు ముందస్తు సాగుకు వ్యవసాయ అధికారులు రైతులను సన్నద్ధం చేస్తున్నారు. నాలుగు మండలాల్లో 2335 ఎకరాల్లో వరి, అపరాలు సాగుకు 335 క్వింటాళ్ల వరి, అపరాల విత్తనాలు అవసరమవుతుందని అధికారులు ప్రతిపాదనలు చేశారు. ఈ పంటలను ఆరుతడిగా సాగు చేయాల్సి ఉంది.

ఈ గ్రామాల్లో వరి నాట్లు నిల్

వ్యవసాయశాఖ సబ్‌డివిజన్ పరిధిలోని తుని, తొండంగి, కోటనందూరు, రౌతులపూడి, శంఖవరం మండలాలు ఉన్నాయి. పంపా రిజర్వాయర్, పుష్కర, పీబీసీ కాలువలు ద్వారా తొండంగి మండలానికి సాగు నీరు అందడంతో ఖరీఫ్ సాగవుతుంది. సరైన సాగునీటి వసతుల్లేక, వర్షాలు కురవకపోవడంతో తుని మండలంలో సాగునీటి చెరువులు వెలవెలబోతున్నాయి. దీంతో వి.కొత్తూరు, లోవకొత్తూరు, డి.పోలవరం, దొండవాక, కొలిమేరు, ఎస్.సూరవరం, రాజుపేట, చామవరం, చేపూరు గ్రామాల్లో ఖరీఫ్ నాట్లు వేయలేదు. తాండవ, ఏలేరు ప్రాజెక్టులు ఉన్నా కోటనందూరు, రౌతులపూడి, శంఖవరం మండలాల్లో శివారు భూములలో నేటికి ఖరీఫ్ వరినాట్లు పడలేదు. దీంతో వరి, అపరాలకు ప్రత్యామ్నాయంగా ముందస్తు రబీ పంటలుగా వేయాలని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు.

తుని సబ్‌డివిజన్‌లో ప్రత్యామ్నాయ పంటల ప్రతిపాదనలు

మండలం	ముందస్తు రబీ వరిసాగు (ఎకరాల్లో)	అవసరమైన విత్తనాలు (క్వింటాళ్లలో)	అపరాల సాగు (ఎకరాల్లో)	అవసరమైన విత్తనాలు (క్వింటాళ్లలో)
కోటనందూరు	300	90	625	50
రౌతులపూడి	213	64	625	50
తుని	385	66	--	--
శంఖవరం	--	--	187	15
మొత్తం	898	220	1437	115

నాట్లు వేయలేదు

మా కుటుంబానికి 70 సెంట్ల భూమి ఉంది. వర్షాధారంగా ఇంటి అవసరాలకు సరిపడే విధంగా ఖరీఫ్‌లో వరిసాగు చేస్తాను. ఈ సంవత్సరం వర్షాలు కురవలేదు. వరినాట్లు వేయ లేదు. తినడానికి అవసరమైన బియ్యం కొనుగోలు చేయాల్సిందే. ప్రత్యామ్నాయంగా వెదజల్లు పద్ధతిలో వరిసాగు చేయాలని అధికారులు సూచించారు.

– బీఏ నాయుడు, రైతు, వి.కొత్తూరు.

ప్రత్యామ్నాయ పంటలు వేసుకోవాలి

ఖరీఫ్ మొదలై మూడు నెలలు అవుతోంది. ఇప్పటివరకూ లోటు వర్షపాతం నమోదైంది. రైతులు వర్షాల కోసం ఎదురు చూడకుండా ప్రత్యామ్నాయ పంటలు వేయాలి. వెదజల్లు పద్ధతిలో వరి, ఆరుతడిగా అపరాలు సాగు చేస్తే లాభదాయకం. విత్తనాలకు అవసరమైన ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపించాము. కొద్దిరోజుల్లో విత్తనాలు అందుబాటులో ఉంటాయి.

– సుంకర బుల్లిబాబు, ఏడీఏ, తుని

తుని సబ్‌డివిజన్‌లో నమోదైన వర్షపాతం వివరాలు

మండలం	సాధారణ వర్షపాతం (మిల్లీ మీటర్లలో)	నమోదైన వర్షపాతం (మిల్లీ మీటర్లలో)
తుని	570.9	435.4
కోటనందూరు	393.5	454.2
తొండంగి	565.9	465.5
రౌతులపూడి	558.7	410.6
శంఖవరం	558.7	312.0

నేడు జగనన్న ఆరోగ్య సురక్షపై అవగాహన

తుని రూరల్: ఈ నెల 30 నుంచి ప్రారంభమయ్యే జగన్న ఆరోగ్య సురక్ష శిబిరాలపై గురువారం వైద్య సిబ్బందికి అవగాహన సదస్సు ఏర్పాటు చేసినట్టు ఎంపీడీఓ రవికుమార్ బుధవారం తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉదయం 10.30 గంటలకు సదస్సు ప్రారంభమవుతుందన్నారు. ఈ నెల 30 నుంచి నవంబర్ ఒకటో తేదీ వరకు గ్రామాల్లో జగన్న ఆరోగ్య సురక్ష శిబిరాలను నిర్వహిస్తామని చెప్పారు. తేటగుంట, ఎస్.సూరవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులు పర్యవేక్షణలో శిబిరాలు జరుగుతాయని వివరించారు

గర్భిణులకు సామూహిక సీమంతాలు



జి.కొత్తపల్లిలో గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహిస్తున్న దృశ్యం

శంఖవరం: పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని వైస్ ఎంపీపీ ఈగల చిన్నమ్ములు అన్నారు. మండలంలోని జి.కొత్తపల్లిలో గర్భిణులకు బుధవారం సామూహిక సీమంతాలు నిర్వహించారు. అనంతరం గర్భిణులు, బాలింతకు పౌష్టికాహారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వైస్ ఎంపీపీ మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా పిల్లలు ఆరోగ్యంగా ఉంటారన్నారు. గర్భిణులు, బాలింతలకు ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పౌష్టికాహారం అందిస్తోందన్నారు. అంగన్‌వాడీ సిబ్బంది ఎప్పటికప్పుడు బాలింతలు, గర్భిణులకు ఆరోగ్యంపై అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అరుణశ్రీ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం



తుని 23వ వార్డులో ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న చైర్‌పర్సన్ సుధారాణి

తుని: పట్టణంలోని ప్రజల సమస్యలను పరిష్కరించేందుకే వార్డుల్లో పర్యటిస్తున్నామని మున్సిపల్ చైర్‌పర్సన్ ఏలూరి సుధారాణి అన్నారు. బుధవారం సాయంత్రం 23వ వార్డులో కౌన్సిలర్ కర్రి శ్రీదేవి ఆధ్వర్యంలో మన మున్సిపాలిటీ–మన బాధ్యత కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మంచినీరు, శానిటేషన్, కాలవల నిర్మాణం తదితర సమస్యలను మహిళలు చైర్‌పర్సన్ దృష్టికి తీసుకువచ్చారు. ఆయా సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. వైఎస్సార్ సీపీ యువజన విభాగం తుని నియోజకవర్గ అధ్యక్షుడు ఏలూరి బాలు, మున్సిపల్ వైస్ చైర్మన్ పామర్తి మహేష్, గాంధీ సత్రం చైర్మన్ అనిశెట్టి సూర్యచక్రరెడ్డి, తుని పట్టణశాఖ పార్టీ అధ్యక్షుడు రేలంగి రమణా గౌడ్, జిల్లా వక్ఫ్‌బోర్డు వైస్ చైర్మన్ షేక్ ఖ్వాజా, కమిషనర్ ప్రసాదరాజు, కౌన్సిలర్లు, సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు పాల్గొన్నారు.

తహసీల్దార్‌గా కుశరాజు



కోటనందూరు: స్థానిక తహసీల్దార్‌గా కె.కుశరాజు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకూ ఇక్కడ ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా పని చేసిన ఐ.జగదీష్ సస్పెండ్ కావడంతో తుని డిప్యూటీ తహసీల్దార్‌గా పని చేస్తున్న కుశరాజుకు కోటనందూరు తహసీల్దార్‌గా పూర్తి అదనపు బాధ్యతలు(ఎఫ్ఏసీ) అప్పగిస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. నూతన తహసీల్దార్ కుశరాజుకు వీఆర్వోలు, తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది స్వాగతం పలికారు. ప్రజాప్రతినిధులు, సిబ్బంది సహకారంతో మండల ప్రజలకు మెరుగైన సేవలందిస్తానని నూతన తహసీల్దార్ కుశరాజు తెలిపారు.

ముగిసిన మండల స్థాయి క్రీడా పోటీలు



క్రీడాకారులకు ఆల్ ది బెస్ట్ చెబుతున్న ఒమ్మి రఘురాం

రౌతులపూడి: మండలంలోని ఎ.మల్లవరం గురుకుల పాఠశాల ఆవరణలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు నిర్వహించిన మండలస్థాయి క్రీడాపోటీలు పోటీలు బుధవారంతో ముగిశాయి. అండర్–14 బాలికల విభాగంలో ములగపూడి హైస్కూల్‌కు చెందిన విద్యార్థినులు ఖోఖో, వాలీబాల్, టెన్నీకాయిట్, బాల్ బాడ్మింటన్, షటిల్ బాడ్మింటన్‌లో ప్రతిభ కనబరిచారు, గిడజాం ఎంపీయూపీ స్కూల్ విద్యార్థినులు కబడ్డీ, రౌతులపూడి హైస్కూల్‌కు చెందిన విద్యార్థినులు త్రోబాల్‌లో ప్రతిభ కనబరిచారు.అండర్–14 బాలుర విభాగంలో రౌతులపూడి హైస్కూల్ విద్యార్థులు వాలీబాల్, త్రోబాల్, టెన్నికాయిట్, ములగపూడి విద్యార్థులు ఖోఖో, బాల్ బాడ్మింటన్, ఎ.మల్లవరం గురుకుల పాఠశాల విద్యార్థులు కబడ్డీలో ఉత్తమ ప్రతిభ కనబరిచారు. ఎంపికైన విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు. క్యాక్రమంలో పీఈటీలు పద్మరాజు, నాని, సత్యనారాయణ, రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడాస్ఫూర్తిని అలవర్చుకోవాలి



ఎ.మల్లవరం గురుకుల పాఠశాలలో కబడ్డీ ఆడుతున్న విద్యార్థినులు

జగ్గంపేట: విద్యార్థులు జీవితంలో ఉన్నతంగా ఎదగాలంటే క్రీడాస్ఫూర్తిని అలవర్చుకోవాలని రాష్ట్ర వైఎస్సార్ సీపీ సేవాదళ్ కార్యదర్శి ఒమ్మి రఘురాం సూచించారు. మండలంలోని కాట్రావులపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి క్రీడా పోటీలను బుధవారం ఆయన ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం పి.శ్రీనివాసరావు, ఇంచార్జి హెచ్ఎం శిరీష, వ్యాయమా ఉపాధ్యాయులు ఎన్.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రాభివృద్ధే లక్ష్యంగా పాలన

- ఎమ్మెల్యే పర్వతపూర్ణచంద్రప్రసాద్
- యర్రవరంలో గడపగడపకు మనప్రభుత్వం



యర్రవరంలో మహిళలకు సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే పర్వత ప్రసాద్

ఏలేశ్వరం: రాష్ట్రాభివృద్ధే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్ర ప్రసాద్ అన్నారు. మండలంలోని యర్రవరంలో బుధవారం ఆయన గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ నాయకులు, అధికారులతో కలిసి ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టిన నాటి నుంచి అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తున్నారన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన అన్ని హామీలను నెరవేర్చిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. తమ ప్రభుత్వంలో పార్టీలకు అతీతంగా అర్హులందరికీ పథకాలు అందుతున్నాయన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు నీరుకొండ రామకుమారి, సర్పంచ్ బీశెట్టి అప్పలరాజు, పార్టీ నాయకులు నీరుకొండ సత్యనారాయణ, దాసరి రమేష్, బొడ్డు కృష్ణ, నీరుకొండ అర్జునరావు, అడపా దుర్గా, గుల్లంపూడి గంగాధర్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు ఉపాధ్యాయ దినోత్సవం

గోకవరం: యూటీఎఫ్ మండల శాఖ ఆధ్వర్యంలో గురువారం గోకవరంలో ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించనున్నట్టు యూటీఎఫ్ నాయకుడు ఎస్.అనిల్‌కుమార్ బుధవారం తెలిపారు. సుంకర వెంకటరమణ, సావిత్ర ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో స్థానిక ఎస్వీఆర్ ఫంక్షన్ హాలులో మధ్యాహ్నం 2 గంటలకు నిర్వహించే ఈ కార్యక్రమంలో ఉభయ గోదావరి జిల్లాల గ్రాడ్యుయేషన్ ఎమ్మెల్సీ ఐ.వెంకటేశ్వరరావు ముఖ్యఅతిథిగా పాల్గొంటారన్నారు. ఉపాధ్యాయులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

పథకాల అమలులో అశ్రద్ధ తగదు

ప్రత్తిపాడు: మాతా, శిశు సంక్షేమం కోసం ప్రభుత్వం అందిస్తున్న పథకాలను అమలు చేయడంలో అశ్రద్ధ తగదని ప్రత్తిపాడు ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి ఆర్‌వీఎస్ లక్ష్మి హెచ్చరించారు. స్థానిక మండల విద్యాశాఖ మానవ వనరుల కేంద్రంలో బుధవారం ఐసీడీఎస్ ప్రాజెక్టు సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణలో అలసత్వం వహించవద్దని హెచ్చరించారు. జగనన్న ఆరోగ్య సురక్ష, ఇంటింటికీ పౌష్టికాహారం సక్రమంగా నిర్వహించాలని సూచించారు. తల్లీబిడ్డల ఆరోగ్యం పట్ల ఎప్పటికప్పుడు పర్యవేక్షించి, వారికి తగిన సూచనలు, సలహాలు ఇవ్వాలని కోరారు. సమావేశంలో ప్రత్తిపాడు, ఏలేశ్వరం మండలాల ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, అంగన్వాడీ వర్కర్లు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

- ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్
- ఏలేశ్వరంలో లబ్ధిదారులకు కొత్త పింఛన్ల పంపిణీ



ఏలేశ్వరంలో లబ్ధిదారులకు నూతన పింఛన్లు అందజేస్తున్న ఎమ్మెల్యే పర్వత ప్రసాద్

ఏలేశ్వరం: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్ అన్నారు. స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో బుధవారం నూతనంగా మంజూరైన పింఛన్లను ఎమ్మెల్యే లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం జగన్ గతంలో లేని విధంగా పింఛన్ల సొమ్ము పెంచారన్నారు. గత నాలుగేళ్లలో రాష్ట్రవ్యాప్తంగా 28.28 లక్షల మందికి కొత్తగా పింఛన్లు వచ్చాయన్నారు. కులమతాలు, పార్టీలకు అతీతంగా పథకాలు అమలు చేస్తున్న ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ అలమండ సత్యవతి, వైస్ చైర్‌పర్సన్ మసిరపు బుజ్జి, శిడగం వెంకటేశ్వరరావు, అలమండ చలమయ్య, బదిరెడ్డి గోవిందు, తొండారపు రాంబాబు, జువ్విన వీర్రాజు తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ పింఛన్లు

కోటనందూరు: అర్హులందరికీ ప్రభుత్వం పింఛన్లు మంజూరు చేస్తోందని ఎంపీపీ లగుడు శ్రీనివాసు అన్నారు. మండలంలోని బిళ్లనందూరులో కొత్తగా మంజూరైన పింఛన్లను బుధవారం సర్పంచ్ బొత్స మంగతో కలిసి ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ఎక్కడా వివక్షతకు తావు లేకుండా అర్హతే ప్రామాణికంగా కొత్త పింఛన్లు మంజూరు చేశారన్నారు. మండలంలో 100 శాతం అర్హులకు పింఛన్లు అందుతున్నాయన్నారు. అల్లిపూడిలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ చింతకాయల చినబాబు సర్పంచ్ తరిపే చినతల్లి, వైఎస్సార్ సీపీ నాయకులతో కలిసి లబ్ధిదారులకు కొత్త పింఛన్లు పంపిణీ చేశారు. ఇండుగపల్లిలో సర్పంచ్ కుంచే సత్యవతి కొత్తగా మంజూరైన పింఛన్లను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. మండల వ్యాప్తంగా 15 గ్రామ సచివాలయాల పరిధిలో 450 కొత్త పింఛన్లు మంజూరైనట్టు ఎంపీడీఓ సుబ్రహ్మణ్యశర్మ తెలిపారు.

తుని రూరల్: అర్హతే పామాణికంగా ప్రభుత్వం పింఛన్లు మంజూరు చేస్తోందని వైస్ ఎంపీపీ చోడిశెట్టి సత్య నాగేశ్వరరావు అన్నారు. ఎస్.అన్నవరం పంచాయతీ కార్యాలయంలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో బుధవారం కొత్తగా మంజూరైన 84 మందికి ఆయన అందజేశారు. ఈ సందర్భంగా వైస్ ఎంపీపీ మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా అర్హులందరికీ పింఛన్లు అందుతున్నాయన్నారు. తాళ్లూరులో లబ్ధిదారులకు వైఎస్సార్ సీపీ నాయకుడు తమరాన శ్రీనివాసరావు పింఛన్లు పంపిణీ చేశారు. జేసీఎస్ ఇన్‌చార్జ్ సకురు నాగేంద్ర నెహ్రూ, వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు గంటా చక్రరావు, పరదేశమ్మ అమ్మవారి ఆలయం చైర్మన్ వేముల శివనారాయణ, తాళ్లూరు ఎంపీటీసీ గండి రాజులనాయుడు పాల్గొన్నారు.

ప్రత్తిపాడు: రాజకీయాలకు అతీతంగా ప్రభుత్వం అర్హులైన వారందరికీ పింఛన్లు మంజూరు చేస్తోందని అన్నవరం దేవస్థానం పాలకమండలి సభ్యుడు దోనే చిట్టిబాబు అన్నారు. మండలంలోని పెదశంకర్లపూడిలో నూతనంగా మంజూరైన 18 పింఛన్లను బుధవారం లబ్ధిదారులకు ఆయన పంపిణీ చేశారు.

గండేపల్లి: మండలంలోని నీలాద్రిరావుపేటలో లబ్ధిదారులకు బుధవారం కొత్త పింఛన్లు పంపిణీ చేశారు. గ్రామంలోని లబ్ధిదారులకు సర్పంచ్ ములంపాక సురేష్, అధికారులు పింఛన్లు అందజేశారు. కార్యక్రమంలో వెల్ఫేర్ ఆఫీసర్ యంవీడీ ప్రసాద్, గ్రామ సచివాలయ జేసీఎస్ కన్వీనర్లు కాకి శ్రీను, నక్కా అబ్బు, పార్టీ కార్యకర్త ఇసరపు లోవరాజు పాల్గొన్నారు.

తొండంగి: మండలంలోని బెండపూడిలో లబ్ధిదారులకు కొత్తగా మంజూరైన పింఛన్లను వైఎస్సార్ సీపీ మండల యూత్ కన్వీనర్ ఆరుమిల్లి ఏసుబాబు చౌదరి వైఎస్సార్ సీపీ నాయకులతో కలిసి పంపిణీ చేశారు. వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ మద్దుకూరి వీరవెంకట సత్యనారాయణ చౌదరి(పెద్దబ్బు), పార్టీ నాయకులు ఏలేటి ధర్మరాజు, ఎంటీటీసీలు గొంతెన నాగేశ్వరరావు, మళ్ల సురేష్ పాల్గొన్నారు.

శంఖవరం: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో అర్హులందరికీ పింఛన్లు అందజేస్తున్నట్టు ఎంపీపీ పర్వత రాజబాబు తెలిపారు. స్థానిక సచివాలయంలో నూతనంగా మంజూరైన పింఛన్లను బుధవారం ఆలయన లబ్ధిదారులకు అందజేశారు. ఎంపీడీఓ జి.శివరామకృష్ణ, ఉప సర్పంచ్ చింతనీడి కుమార్, ఎంపీటీసీ అడపా వీరబాబు పాల్గొన్నారు.

గోకవరం: వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అర్హులందరికీ పింఛన్లు అందుతున్నాయని ఆ పార్టీ సీనియర్ నాయకుడు సుంకర వీరబాబు, సచివాలయ మండల కన్వీనర్ దాసరి రమేష్, మండల కన్వీనర్ పాటి రాంబాబు అన్నారు. మండలంలో రంప యర్రంపాలెం, గుమ్మళ్లదొడ్డి, వెదురుపాక, అచ్యుతాపురం, కృష్ణునిపాలెం, తంటికొండ తదితర గ్రామాల్లో లబ్ధిదారులకు నూతనంగా మంజూరైన పింఛన్లను బుధవారం వారు పంపిణీ చేశారు.

నేడు కొత్త పింఛన్ల పంపిణీ

జగ్గంపేట: మండలంలోని లబ్ధిదారులకు కొత్తగా మంజూరైన పింఛన్లను గురువారం ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు పంపిణీ చేస్తారని ఎంపీడీఓ వసంతకుమార్ బుధవారం తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉదయం 9.30 గంటలకు పింఛన్ల పంపిణీ పారంభమవుతుందన్నారు.

కిర్లంపూడి: మండలంలోని లబ్ధిదారులకు కొత్తగా మంజూరైన పింఛన్లను గురువారం పంపిణీ చేస్తామని ఎంపీపీ తోట రవి బుధవారం తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఉదయం 10:30 గంటలకు నిర్వహించే ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు పాల్గొని లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేస్తారని చెప్పారు.



అల్లిపూడిలో లబ్ధిదారులకు కొత్త పింఛన్లు పంపిణీ చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు



ఎస్.అన్నవరంలో లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేస్తున్న వైస్ ఎంపీపీ సత్య నాగేశ్వరరావు, నాయకులు



పెదశంకర్లపూడిలో లబ్ధిదారులకు పింఛన్లు అందిస్తున్న చిట్టిబాబు



శంఖవరంలో లబ్ధిదారులకు పింఛన్లు అందజేస్తున్న ఎంపీపీ పర్వత రాజబాబు



బెండపూడిలో లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు